క్లుప్తంగా

వెంకటేష్‌ను కలిసిన రూరల్ ఎస్సై



సమన్వయకర్త వెంకటేష్‌కు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న రూరల్ ఎస్సై శివకుమార్

చీరాల టౌన్: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో చీరాల మండలంలో గ్రామాల్లో ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని నూతన రూరల్ ఎస్సై ఎం.శివకుమార్ అన్నారు. మండలంలోని ఈపురుపాలెం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు నూతన ఎస్సైగా వీఆర్‌లో ఉన్న ఎం.శివకుమార్‌ను నియమించారు. ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆయన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. అంకిత భావంతో విధులు నిర్వహించి శాంతిభద్రతలను పరిరక్షించాలని వెంకటేష్ ఎస్సైకు సూచించారు.

వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరులో నేడు వైఎస్సార్ ఆసరా 4వ విడత కార్యక్రమం జరుగుతుందని ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి హాజరవుతారన్నారు. ప్రతి ఒక్క డ్వాక్రా మహిళలు హాజరు కావాలని విజ్ఞప్తి ఆయన చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో నేడు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని సోమవారం ఎంపీడీవో మాధ్యుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరగనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని ప్రజా సమస్యలపై చర్చించాలని తెలిపారు.

పుస్తకావిష్కరణ సభ పోస్టర్ విడుదల



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అద్దంకి: విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన జానపదాలు, జ్ఞానపదాలు గ్రంథాన్ని ఈనెల 10వ తేదీన పట్టణంలోని గీతా మందిరంలో ఉదయం 10 గంటలకు ఆవిష్కరించనున్నట్లు రిటైర్డ్ అర్జేడీ యూ దేవపాలన తెలిపారు. సోమవారం స్థానిక ప్రియదర్శిని ఫర్నీచర్ షాప్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి రామాంజనేయులు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, సాహితీ విశ్లేషకులు అన్నంనేని వెంకట్రావు, వారణాశి రఘురామశర్మ, చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొండ మంజులూరులో నేత్ర దానం



చింతల వెంకటేశ్వర్లు (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): కొండమంజులూరుకు చెందిన చింతల వెంకటేశ్వర్లు (70) సోమవారం మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు ఆయన కార్నియాలను దానం చేశారు. భార్య నాగేంద్రం, కుమార్తెలు వలేటి రజిని, బొప్పూడి సుజాత, ఇతర కుటుంబ సభ్యులు అంగీకారంతో ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవ దాన కమిటీకి సమాచారం అందించిన మీదట గుంటూరు శంకర్ కంటి వైద్యశాల వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యలను అవయవ దాన కమిటీ సభ్యులు జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), సోమేపల్లి రామ్మోహనరావులతో పాటు క్లబ్ అధ్యక్ష, కోశాధికారులు కరి కమలేశ్వరరావు, చుండి సాంబశివరావు, రోటరీ సభ్యులు అభినందించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయనం, పుష్యమాసం మూల నక్షత్రం, ద్వాదశి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో మేలు



ఇంకొల్లులో కూరగాయల స్టాల్ ఏర్పాటు చేసిన సిబ్బంది



చినగంజాం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను అమ్ముతున్న రిసోర్స్‌పర్సన్లు

చినగంజాం: ప్రకృతి వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయలతో ఎంతో ఆరోగ్యం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా నేచురల్ ఫార్మింగ్ అధికారి వరదానం అన్నారు. సోమవారం చినగంజాం రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూరగాయల సంతను ఏర్పాటు చేసి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కూరగాయల అమ్మకం జరిపారు. జెడ్‌బీఎన్‌ఎఫ్ పద్ధతిలో రసాయనిక ఎరువులను వినియోగించకుండా ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయల పండిస్తారన్నారు. ఆవు మూత్రం, ఆవు పేడ, ఆవు ఉత్పత్తులతో, ప్రకృతిలో లభించే వేప ఆకు తదితర పదార్థాలతో కషాయాలు తయారు చేసి పిచికారీ చేస్తారన్నారు. భూమికి దిబ్బ ఎరువు వేసి పండించిన పంటలకు దశపర్ణి, నీమాస్త్రం, జీవామృతం వాడి నేచురల్ ఫార్మింగ్ చేస్తారని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వంకాయలు, కాకర కాయలు, పచ్చిమిర్చి, బీట్‌రూట్, క్యారట్, ఆకుకూరలు పాలకూర, చుక్కకూర, గోంగూర వంటి వాటిని సంతలో ఉంచి ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరికి వారు స్వయంగా విక్రయించారు. కార్యక్రమంలో మండల కమ్యూనిటీ యాక్టివిస్ట్ బీ విజయమ్మ, చీరాల డివిజన్ మార్కెటింగ్ ట్రైనర్ భారతి, మండల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ గీత ఐసీఆర్‌పీ (ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్)లు రజిని, లోకేశ్వరి, కమల, శ్రీలక్ష్మి,ప్రసన్న, భార్గవి, శాంతి పాల్గొన్నారు.



వేటపాలెంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో రూతమ్మ



పర్చూరు: ఆర్గానిక్ కూరగాయలను కొనుగోలు చేస్తున్న తహసీల్దార్ సంధ్యశ్రీ

➤ ప్రకృతి వ్యవసాయంలో ఆర్గానిక్ ఉత్పత్తులతో పండించిన పంటలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యాలను కాపాడుకోవచ్చు అని పర్చూరు తహశీల్దార్ కే సంధ్యశ్రీ అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పండించిన ఉత్పత్తులతో స్టాల్‌ను ఏర్పాటు చేయడంతో తహసీల్దార్ ప్రారంభించారు. అనంతరం కూరగాయలను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది కొనుగోలు చేశారు. కార్యక్రమంలో డీటీ నాగలక్ష్మి, ఏఎస్‌ఓ శ్రీమన్నారాయణ, మాస్టర్ ట్రైనర్ సీహెచ్ అప్పారావు, మోడల్ మేకర్ జీ పద్మజ, యూనిట్ ఇన్‌చార్జ్‌లు జీ అంకారావు, శ్రీనివాసరావు, లలితమ్మ, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

వేటపాలెంలో..

వేటపాలెం: ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయని ఎంపీడీవో రూతమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం స్టాల్‌ను సోమవారం ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ద్వారా పండించిన ఉత్పత్తులు తినడం ద్వారా ఆరోగ్యకరంగా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో మండల అడ్వైజరీ కమిటీ చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, ఏఓ ఐ కాశీవిశ్వనాథ్, సూపరింటెండెంట్ శర్మ, అనూరాధ పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు వాడటం ఆరోగ్యానికి ఎంతో మేలు అని ఇంకొల్లు డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణగీత అన్నారు. సోమవారం మండల ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో వంకాయలపాడు యూనిట్ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీఎం టీ మోహనరావు, ఆర్‌ఎస్ డీటీ లక్ష్మీకుమారి, ఏఎస్‌ఓ పుష్పలత, యూనిట్ ఇన్‌చార్జ్ బీ వెంకటస్వామి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి



చీరాల తహశీల్దార్ నాసరయ్య



చీరాల ఆర్డీవోగా సూర్యనారాయణరెడ్డి



నూతన ఎంపీడీవోగా శివసుబ్రమణ్యం



మేదరమెట్ల ఎస్‌ఐగా చంద్రశేఖర్



కారంచేడు తహశీల్దారు మెహర్‌కుమార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

చీరాల టౌన్: సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని, త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చీరాల నూతన ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా చీరాల ఆర్డీవోగా పనిచేస్తున్న పి.సరోజిని నర్సరావుపేట ఆర్డీవోగా బదిలీ కావడంతో ఈ స్థానంలో కాకినాడలో ఏపీజీడీసీఎల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న జి.సూర్యనారాయణరెడ్డిని చీరాల ఆర్డీవోగా నియమించారు. సోమవారం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన నూతన ఆర్డీవోకు కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతన ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.

తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నాసరయ్య..

మండలంలో ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరంగా పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉంటానని చీరాల మండల నూతన తహశీల్దార్ కె.నాసరయ్య తెలిపారు. చీరాల మండల నూతన తహశీల్దార్‌గా కె.నాసరయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన తహశీల్దార్‌కు డీటీ సురేష్‌బాబు, రీ సర్వే డీటీ అర్జున్, ఆర్‌ఐ శేఖర్, వీఆర్వోలు పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు అందించారు.

ఎంపీడీఓగా శివసుబ్రమణ్యం..

యద్దనపూడి: మండల నూతన ఎంపీడీవోగా పీ శివసుబ్రమణ్యం సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా అచ్చంపేట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చి విధుల్లోకి చేరారు. ప్రస్తుతం ఎంపీడీఓగా పనిచేస్తున్న కృష్ణకుమారి నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కలిసి అభినందనలు తెలిపారు.

మేదరమెట్ల ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జాతీయరహదారిపై ఉన్న పోలీస్‌స్టేషన్‌కు ఏ.చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి..

కారంచేడు: మండలంలోని ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తహశీల్దారు పీ మెహర్‌కుమార్ అన్నారు. ఆయన గుంటూరు జిల్లా అమృతలూరు మండలం నుంచి కారంచేడుకు బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ సుశీల నుంచి బాధ్యతలు తీసుకున్నారు. డీటీ పీ సుశీల, ఆర్‌ఐ అరుణ, అనిత, వర్షిత, సువర్ణ, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, రేషన్ డీలర్లు తహశీల్దార్‌ను కలసి అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీని గెలిపించటానికి ప్రజలు సిద్ధం



మాట్లాడుతున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి



హనిమిరెడ్డిని గుర్రంపై ఊరేగిస్తున్న పార్టీ శ్రేణులు, గ్రామస్తులు

అద్దంకి రూరల్: రాబోయో ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని జార్లపాలెం గ్రామంలో పల్లెపల్లెకు హనిమిరెడ్డి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హనిమిరెడ్డికి గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికి గుర్రంమీద ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఒక్కరిని పలకరిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. అందుతున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు వివరించారు. ఈసందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభకు వచ్చిన ప్రజలను చూసి చంద్రబాబునాయుడికి నిద్ర కరువై భయం పట్టుకుందన్నారు. రాబోయో ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపును ఎవరు ఆపలేరన్నారు. రాష్ట్రానికి మంచి జరగాలంటే మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. అద్దంకిలో వైఎస్సార్ సీపీని గెలిపించుకుని జగనన్నకు బహుమతిగా ఇవ్వాలన్నారు. తొలుతగా గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో సచివాలయాన్ని, రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, మండల పార్టీ కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కల్యాణ మండప అభివృద్ధికి కృషి



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సమన్వయకర్త వెంకటేష్

చీరాల అర్బన్: పట్టణ పరిధిలోని మూడు రోడ్ల సెంటర్ వద్ద నిర్మిస్తున్న యాదవ కల్యాణ మండప అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం కల్యాణ మండపం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. కరణం వెంకటేష్ మాట్లాడుతూ చీరాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. కల్యాణ మండపం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాన్ని అందిస్తామన్నారు. నియోజవర్గంలో ఏ సమస్య వచ్చినా తాను పరిష్కరిస్తానని చెప్పారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో పట్టణంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలతో మమేకమవుతున్నామని చెప్పారు. మీరందరూ ప్రభుత్వానికి అండగా ఉండి చీరాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని వారిని వెంకటేష్ కోరారు. కార్యక్రమంలో బుర్ల వెంకట్రావు, పెరుగు భాస్కర్, కీర్తి వెంకట్రావు, వీరయ్య, గొల్లప్రోలు కృష్ణ, బుర్ల మురళి, పులి వెంకటేశ్వర్లు, పులి హరికృష్ణ, ఆతిన శ్రీనివాసరావు, ప్రసాద్, వీరాస్వామి, చుక్కా నాగలక్ష్మి, రమేష్, ఆవుల అశోక్, ఏ వెంకట్రావు, పుష్పరాజ్, సాయితేజ పాల్గొన్నారు.



సమన్వయకర్త చిన హనిమిరెడ్డితో రాచపూడి ఎస్సీ కాలనీ యువకులు

పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి

మేదరమెట్ల: వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గం సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని కొరిశపాడు మండలంలోని రాచపూడి ఎస్సీకాలనీ యువకులు పేర్కొన్నారు. అద్దంకి పార్టీ కార్యాలయంలో సమన్వయకర్తను కలసిన యువకులు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు పనిచేస్తామన్నారు. అలాగే అద్దంకిలో ఈ సారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు యువత ఎంతో ఉత్సాహంగా ఉందన్నారు. ఈసందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ ఎప్పుడు ఎలాంటి పనిఉన్నా తనకు ఒక ఫోన్ చేస్తే చాలు దాని పరిష్కారానికి సిద్ధంగా ఉన్నానని యువతకు తెలిపారు.



సుబ్బారావుతో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

అద్దంకి: స్థానిక మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అల్లహరి వెంకట సుబ్బారావును హనిమిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో పార్టీకి గెలుపుకు సహకరించాలని కోరారు. తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని సుబ్బారావు హనిమిరెడ్డికి చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు



చీరాలలో ఆర్టీసీ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



అద్దంకిలో డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

చీరాల అర్బన్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ సంస్థలో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్లు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని లైఫ్ హాస్పిటల్ డాక్టర్లు ఎం.అవంతి, గోపికృష్ణ అన్నారు. రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో చీరాల లైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, కండక్టర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డిపో మేనేజర్ జె.శ్యామల మాట్లాడుతూ డ్రైవర్లు బస్సు నడిపే సమయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. శిబిరంలో జనరల్, అత్యవసరం, క్రిటికల్ వైద్యనిపుణులు డాక్టర్ గోపీకృష్ణ, చెవి,ముక్కు, గొంతు వైద్యులు ఎం.అవంతి పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ డి.కుమారి, కార్గో ప్రవీణ్‌కుమార్, యూనియన్ నాయకులు తులసి శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది, హాస్పిటల్ మేనేజర్ ఆకురాతి రేవంత్, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యుడు శ్రీనివాస్ డ్రైవర్లకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న చంటి

బల్లికురవ: భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కలహాలకు దారితీయడంతో భర్త ఎలుకల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈఘటన సోమవారం మండలంలోని కొమ్మినేని వారిపాలెంలోని ఎస్టీ కాలనీలో జరిగింది. అందిన సమాచారం మేరకు కాలనీకి చెందిన పాట్లూరి చంటికి మూడేళ్ల క్రితం అదే కాలనీకి చెందిన రాపూరి అంజయ్య రమణల కుమార్తె దుర్గాలక్ష్మితో వివాహం అయింది. వీరికి ఒక బాబు. అత్తమామలు అద్దంకి మండలంలోని కలవకూరు చెరువు వద్ద కాపలా పని చేస్తుంటారు. చంటి దుర్గాలక్ష్మి కూడా అక్కడే ఉంటుంటారు. వారం క్రితం స్వగ్రామం వచ్చారు. ఈక్రమంలో ఇరువురి మధ్య వివాదం తలెత్తింది. మనస్థాపానికి గురైన చంటి ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న చంటి ఇరుగుపొరుగు వారు చూసి 108కు సమాచారం అందజేశారు. అద్దంకి నుంచి వచ్చిన 108 వాహన ఈఎంటీ హరిబాబు, పైలెట్ రామచంద్రయ్య ప్రథమ చికిత్స చేసి ఉన్నత చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

రజకులకు సముచిత స్థానం కల్పించాలని పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న నాగమల్లేశ్వరరావు

మేదరమెట్ల: రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలు రజకులకు సముచిత స్థానం కల్పించాలని కోరుతూ నేషనల్ దోభీ మహా సంగ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు తిరుపతి నుంచి విజయవాడ వరకు చేపట్టిన పాదయాత్ర చేస్తున్నాడు. ఈయాత్ర తిమ్మనపాలెం గ్రోత్‌సెంటర్ వద్దకు సోమవారం చేరుకుంది. గత 16 రోజుల నుంచి పాదయాత్ర చేస్తున్నట్లు రజకకుల సమస్యలను పరిష్కరించే దిశగా అన్ని పార్టీలు ముందుకు రావాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, అద్దంకి నియోజకవర్గం అధ్యక్షుడు రవిచంద్రాచారి, సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు, రజకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహశీల్దార్

అద్దంకి: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్తలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సచివాయాల్లో వేగవంతం చేయాలని తహసీల్దార్ మహబూబ్ సుభానీ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని చక్రాయపాలెం గ్రామ సచివాయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ రూరల్ పరిధిలో 260 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు వెల్లడించారు. ప్రభుత్వ కల్పించిన ఈ సదవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.